సాక్షి కర్నూలు

గురువారం । 21 । ఆగస్టు । 2025



కూటమి కుట్ర కని'పింఛన్'!
చూపు లేని వారు కొందరు.. పుట్టుకతోనే మంచానికి పరిమితమైన వారు మరికొందరు.. దీర్ఘకాలిక రోగులు ఇంకొందరు. వీరి పింఛన్లకు కోత వేస్తూ కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. 8లో▸



నందీశ్వరుడికి అభిషేకం
మహానంది: ఆలయంలో నందీశ్వరుడికి బుధవారం ప్రదోష కాలంలో అభిషేకార్చనలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అభిషేకాన్ని తిలకించి 'నందీశ్వరా...నమో నమ' అంటూ ప్రణమిల్లారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.44
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:74.679
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,28,894
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,28,051

న్యూస్‌రీల్

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి హుండీ ఆదాయం రూ.3,35,31,756 వచ్చింది. బుధవారం స్థానిక రాజాంగణ భవనంలో శ్రీమఠం హుండీ కానుకలు లెక్కగట్టారు. 20 రోజులకుగానూ హుండీల్లో కానుకలను లెక్కించగా నగదు రూ.3,24,52,256, నాణేలా రూపంలో రూ.10,79,500 సమకూరింది. అంతేగాక 1140 గ్రాముల వెండి, 74 గ్రాముల బంగారు వచ్చినట్లు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.

'యూరియా' తనిఖీలకు ప్రత్యేక బృందం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగిస్తున్నారా అనే దానిని గుర్తించేందుకు జిల్లా అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు అయ్యింది. ఈ బృందం సభ్యులు కల్లూరు, కర్నూలు, ఆదోని, కోడుమూరు, వెల్దుర్తి, నందవరం, హొళగొంద, ఆస్పరి మండలాల్లోని పౌల్ట్రీ, మిల్క్, ఇతర పరిశ్రమల్లో యూరియా వినియోగంపై తనిఖీలు చేపడతారు. వారం రోజుల పాటు తనిఖీలు జరుగుతాయి.

ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

- సెప్టెంబర్ 1 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు

కర్నూలు కల్చరల్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలైంది. నెలలుగా నిరీక్షిస్తున్న విద్యార్థులు ఆలస్యంగా డిగ్రీ కళాశాలల్లో చేరబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలకు జాప్యం జరిగినట్లు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీలో చేరేందుకు బుధవారం ఉన్నత విద్యా శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజేస్ (ఓఏఎమ్‌డీసీ) ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 25 నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ క్యాటగిరీ విద్యార్థులకు వెరిఫికేషన్, 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవడం, 29న వెబ్ ఆప్షన్లలో మార్పు చేసుకోవడం, 31వ తేదీ కళాశాలలో సీట్ల కేటాయింపు, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో మొత్తం 82 డిగ్రీ కళాశాలలు ఉండగా అందులో 14 ప్రభుత్వ, 68 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

నీటిని విడుదల చేయాలి

కర్నూలు సిటీ: కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామం వద్ద ఉన్న చెన్నరాయునితిప్ప రిజర్వాయర్‌ను గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని నింపి, ఆయకట్టుకు నీరు అందించేందుకు పంట కాలువలు తవ్వాలని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు బుధవారం జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ డిప్యూటీ ఎస్.ఈ డి.మల్లికార్జున రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ.. చాలా ఏళ్ల క్రితం రిజర్వాయర్ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని, కానీ నీటి సదుపాయం కల్పించలేదన్నారు. రిజర్వాయర్ నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు చుక్క నీరు కూడా ఇవ్వలేదని, ఈ ఏడాది భారీగా వర్షాలు కురుస్తున్నాయని, వరద నీరంతా సముద్రంలో కలుస్తుందన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి రిజర్వాయర్‌కు నీటిని అందించాలని, ఆ నీరు ఆయకట్టుకు అందించేందుకు పంట కాలువలను తవ్వాలని కోరారు.

కృష్ణమ్మ ఉరకలు

శ్రీశైలంప్రాజెక్ట్: కృష్ణానది ఉరకలు వేస్తూ నాగార్జున సాగర్‌పై వైపు బిరబిర సాగుతోంది. శ్రీశైలం జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గంటగంటకు వరద ఉధృతి భారీగా పెరుగుతోంది. దీంతో తెరచి ఉంచిన 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను బుధవారం 18 అడుగులకు పెంచారు. స్పిల్‌వే ద్వారా 4,22,100 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి శ్రీశైలంకు 4,53,858 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 4,27,466 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రస్ట్‌గేట్ల ద్వారా 3,25,237, విద్యుత్ ఉత్పాదన అనంతరం 69,411 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. పోతిరెడ్డిపాడు ద్వారా 30,000, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,818 క్యూసెక్కుల నీరు వదిలారు.

కన్నీటి కుంట





నీటి కుంట నుంచి విద్యార్థుల మృతదేహాలను తీసుకెళ్తున్న దృశ్యాలు

- నీటి కుంటలో మునిగి ఆరుగురు విద్యార్థుల మృతి
- చిగిలి గ్రామంలో తీవ్ర విషాదం
- మృతిచెందిన విద్యార్థులంతా ఒకే తరగతికి చెందిన వారే
- అల్లారు ముద్దుగా పెంచిన కుమారుల మృతితో శోకసంద్రంలో తల్లిదండ్రులు

ఆకాశం వైపు చూస్తూ 'చందమామ రావే.. జాబిల్లి రావే' అని పాటపాడారు. చెట్టుపై చిలకను చూస్తూ 'చిట్టి చిలకమ్మ..అమ్మ కొట్టిందా' అని పద్యం వల్లెవేశారు. అడుగులు అటూ ఇటూ వేస్తూ గణితంలో కూడికలు, తీసివేతలు చేశారు. 'సోషియల్' పాఠాన్ని విన్న ఆనందంతో చేను గట్ల వెంట పరుగుతీసి విజయాన్ని సాధించిన గర్వాన్ని ప్రదర్శించారు. ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'ఈత వచ్చు' అనే ధీమాతో నీటి కుంటలో దిగారు. వారి పాటలు, పద్యాలు మూగ బోయాయి. లెక్కలు తప్పిపోయాయి. పేదలైనా అంత వరకు విజయాన్ని ప్రదర్శించిన వారి చేతులు కనిపించలేదు. చిన్నారుల ఆశలు, కలలు జల సమాధి అయ్యాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంతో తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖమే మిగిలింది. చిగిలి గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

ఆస్పరి/ఆలూరు రూరల్: రోజు మాదిరిగానే తల్లిదండ్రులు తమ పిల్లలను ముస్తాబు చేసి యూనిఫాం తొడిగించి పాఠశాలకు పంపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో చదువుకుని తిరిగి ఇంటికి వచ్చిన ఆ చిన్నారులు సరదాగా ఈత కోసం గ్రామ సమీపంలోని నీటి కుంటకు వెళ్లారు. ఈత రాక మునిగి ప్రాణాలు వదిలారు. పొలం పనులకు వెళ్లి తిరిగిగొచ్చిన ఆ తల్లిదండ్రులు.. విగతజీవులైన పిల్లలను చూసి గుండెపగిలేలా రోదించారు. ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో బుధవారం ఈ విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వినయ్, భీమేష్, మహబూబ్ బాషా, సాయి కిరణ్, శశి కుమార్, కిన్నెర సాయి, దుర్గా ప్రసాద్‌లు కలిసి బుధవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. పక్కనే ఇటీవల నిర్మించి ఆగస్టు 15న ప్రారంభించిన ఉన్నత పాఠశాల గురించి చర్చించుకున్నారు. 'మనం ఏడో తరగతికి ఇక్కడికే రావాలి' అనుకున్నారు. సరదాగా ఈత కొట్టేందుకు నీటి కుంటలో దిగారు. దుర్గా ప్రసాద్ ఒడ్డున ఉండగా మిగిలిన ఆరుగురు విద్యార్థులు ఈత రాక నీటి కుంటలో మునిగి పోయారు. గమనించిన దుర్గాప్రసాద్ అక్కడి నుంచి పరుగుపెడతూ గ్రామానికి చేరుకుని జరిగిన విషయాన్ని గ్రామస్తులకు చెప్పాడు. గ్రామ యువకులు కుంట వద్దకు చేరి విద్యార్థులను వెలికి తీశారు. ఇందులో కిన్నెర సాయి కొన ఊపిరితో ఉండగా ఆదోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మిగిలిన ఐదుగురు విద్యార్థులు కుంటలోనే ప్రాణాలు వదిలారు.



వినయ్ మృతదేహం వద్ద కుంటుబీకుల రోదన

పేదింటికి మరింత కష్టం

గడ్డ పెద్ద ఈరన్న, మల్లమ్మలు ప్రతి రోజూ కొండకు వెళ్లి రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె గాయత్రి, రెండో కుమారుడు వినయ్ (10), మూడో కుమారుడు అభి ఉన్నారు. ఇద్దరు కుమారులను బాగా చదివించి ప్రయోజకులని చేస్తే తమకు కష్టాలు తీరుతాయనుకున్నారు. బిడ్డలను అల్లారు ముద్దుగా చూసుకుంటూ పాఠశాలకు పంపించేవారు. పదేళ్ల వయస్సులోనే వినయ్ ప్రాణం పోవటంతో వారి రోదనలు స్థానికులకు కంట తడి పెట్టించాయి.



నీటి కుంటలో పడిన చిన్నారులను బయటకు తీస్తున్న యువకులు, (ఇన్‌సెట్) ప్రమాద సమాచారాన్ని గ్రామస్తులకు తెలిపిన బాలుడు దుర్గాప్రసాద్

ఎవరి కోసం జీవించాలో..

రాముడు, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వీరికి మూడు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె మహాదేవి ఆస్పరిలో పదవ తరగతి చదువుతోంది. రెండో కూతురు రేష్మా చిగిలిలో 8వ తరగతి చదువుతోంది. ఏకైక కుమారుడు భీమేష్ (11)పై ఆశలు పెట్టుకున్నారు. అయితే నీటి కుంటలో పడి భీమేష్ మృతిచెందడంతో 'ఎవరి కోసం జీవించాలో' అని వారి రోదించడం అందరినీ కంట తడి పెట్టించింది.

విషాదమే మిగిలింది

నాగవేణి, కిష్టప్ప దంపతులకు ముగ్గురు కుమారులు. కిష్టప్ప ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పెద్ద కుమారుడు కిరణ్ కుమార్ పదో తరగతి, రెండవ నితీష్ కుమార్ 9వ తరగతి చదువుతున్నారు. చివరి కుమారుడు శశి కుమార్ మృతిచెందడంతో వారింట్లో విషాదమే మిగిలింది.

ఆరిపోయిన కలల దీపం

పీరావలి, జిలేఖా బీ దంపతుల కూతురు పర్వీన్ కూలీ పనికి వెళ్తోంది. పీరా వలి ఆదోనిలో గౌండపనికి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకు ఉన్న ఏకైక కుమారుడు మహబూబ్ బాషా (10)పై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. పెద్ద చదువులు చదివి కుటుంబానికి అండగా ఉంటాడని ఆశించారు. అయితే కుమారుడు నీటి కుంటలో పడి మృతిచెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

ఆశలు గల్లంతు

రాజు, మారుతమ్మలకు ముగ్గురు కుమారులు సంతానం. రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మొదటి కుమారుడు సంపత్ కుమార్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రెండో కుమారుడు కారుణ్య కుమార్ 7వ తరగతి చదువుతున్నాడు. కిన్నెర సాయి (10) ఐదో తరగతి చదువుతున్నాడు. చిన్న కుమారుడిపై తండ్రి రాజు ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు. అయితే కిన్నెర సాయి మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

మాకు ఎవరు దిక్కు?

మమత, మహారాజు దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు సాయి కిరణ్ (10) ఐదో తరగతి, కుమార్తె అశ్రిత ఒకటో తరగతి చదువుతోంది. మమత, మహారాజు బెల్దారు కూలీగా పనిచేస్తూ బిడ్డలను చదివించుకుంటున్నారు. అయితే సాయి కిరణ్ నీటి కుంటలో మునిగి మృతిచెందాడు. 'ఉన్న ఒక్క కొడుకును బాగా చదివించాలని కలలుగన్నాం. మాకు ఎవరు దిక్కు' అంటూ వారు రోదించారు.



సాయి కిరణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

విద్యార్థుల మృతి దురదృష్టకరం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): ఆస్పరి మండలం చిగిలిలో ఆరుగురు చిన్నారులు ప్రమాదవశాత్తు మరణించడంతో హృదయం విషాదంతో నిండిపోయిందని, ఆ బాలల తల్లిదండ్రుల శోకం వర్ణించలేనిదని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో జరిగిన సంఘటనకు మనసెంతో ఆవేదనతో నిండిపోయిందని, ఆ చిన్నారుల ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని కోరుకుంటున్నట్లు చెప్పారు. అతి పిన్న వయస్సులోనే భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉన్న చిన్నారుల మృతి కుటుంబాలకు భరించలేని దుఃఖాన్ని మిగిల్చిందని, ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వచ్చే నెల 13న అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని కోర్టుల్లో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఆదేశించారు. బుధవారం జిల్లా న్యాయ సేవాసదన్‌లో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసులు, రెవెన్యూ, బ్యాంకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టుల్లో పెండింగ్‌లో ఉండి రాజీ కాగల్సిన సివిల్, క్రిమినల్, ఎక్స్చేంజ్, మోటార్ యాక్సిడెంట్, భూసేకరణ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఆందులో ఎక్కువ కేసులు పరిష్కారయ్యేలా పోలీసులు, న్యాయవాదులు చూడాలని సూచించారు.

'రెవెన్యూ' సమస్యలపై ప్రత్యేక దృష్టి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రెవెన్యూ, సర్వే అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్‌డీఓ, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీల్లో 80 నుంచి 85 శాతం వరకు రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయన్నారు. రీసర్వే సమస్యలతోపాటు సర్వేయర్లు ఫీల్డ్‌కు వెళ్లడంలేదని, చెప్పకుండా సర్వే చేస్తున్నారని, డబ్బులు అడుతుతున్నారని అనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయం, సీ బెళగల్, గోనెగండ్ల, కోడుమూరు తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారుల నుంచి సంతృప్తికరమైన పరిష్కారాలు లభించడంలేదని ప్రజలు ఐవీఆర్‌ఎస్‌లో ఫీడ్ బ్యాక్ ఇచ్చారన్నారు. ప్రతి శుక్రవారం ఓ మండలంలో గ్రీవెన్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి శనివారం ఆర్‌ఓఆర్ కోర్టులను నిర్వహించి 20 కేసులను పరిష్కరించాలని సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు జాప్యం లేకుండా ప్రయోజనాలు కల్పించాలన్నారు. దలకు ఇచ్చే స్థలాల కోసం భూములను గుర్తించాలని ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్‌ఓ సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

వచ్చే వారం నుంచి 'పల్లెకుపోదాం'

గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారం నుంచి పల్లెకుపోదాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సునయన ఆడిటోరియంలో బుధవారం ఉదయం స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి నెలలో ఒకసారి పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 80 మంది జిల్లా అధికారులను గుర్తించి ప్రత్యేకాధికారులుగా నియమించామన్నారు. ముందు రాత్రి మాత్రమే ఏ గ్రామానికి వెళ్లాలి అనే సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తామన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ బృందాలతో ప్రత్యేకాధికారి వెంట వెళ్లాల్సి ఉంటుందన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో యూరియా కోసం రైతు లు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెద్దహరివాణం రైతు సేవా కేంద్రం వద్ద, ఆదోని–సిరుగుప్ప రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎక్కడ యూరియా కొరత లేదని రైతులందరికీ అందిస్తున్నామని కల్లిబుల్లి మాటలు చెబుతోందన్నారు. రైతులకు సరిపడా యూరియా మాత్రం అందించడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాత్రం నాలుగు రైళ్లలో యూరియా తెప్పిస్తామని మాటలు చెప్పి నెలరోజులయ్యిందని, కానీ రైతులకు సరిపడేంత యూరియా మాత్రం అందించలేకపోయారన్నారు. తక్షణమే రైతులకు సరిపడినంత యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు లక్ష్మన్న, రైతుసంఘం మండల నాయకులు అబ్బాస్, పెద్దహరివాణం గ్రామ రైతులు పాల్గొన్నారు.



రహదారిపై నిరసన తెలియజేస్తున్న రైతులు

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దారుణం



ఆలూరు: అడ్డగోలు నిబంధనలతో కూటమి సర్కారు దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి మండిపడ్డారు. సర్కారుకు తప్పనిసరిగా దివ్యాంగుల ఉసురు తగులుతుందన్నారు. ఆలూరులో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరైందన్నారు. వీరందరికి తాము అధికారంలోకి వస్తే అధిక పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నమ్మి ఓట్లేసిన దివ్యాంగులకు ఇప్పుడు నోటీసులు జారీ చేసి పింఛన్ ఎత్తివేస్తున్నారన్నారు. కొత్త పింఛన్లు దేవుడెరుగు ఉన్న పింఛన్లకు కూడా కోత పెడుతుండటంతో పేదలకు దిక్కుతోచడం లేదన్నారు. సమావేశంలో ఆలూరు ఎంపీపీ రంగమ్మ, ఎంపీటీసీలు బోయ ఎల్లమ్మ, జీరా నాగమ్మ, దేవరాజ్, జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి భాస్కర్, మండల కో ఆప్షన్ మెంబర్ బాషా, అరికెర వెంకటేశ్వర్లు, మండల కో–కన్వీనర్ వీ రేష్, నాయకులు నాగప్ప, బాబ, జాన్ పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగులపై టీడీపీ ఎమ్మెల్యే దాడి హేయం

కర్నూలు కల్చరల్: విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులపై శ్రీశైలం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, అతని అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనను దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మంగళవారం రాత్రి శ్రీశైలం శిఖరం చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఉప అటవీ క్షేత్రాధికారి, ఇద్దరు బీట్ ఆఫీసర్లను, ఇతర సిబ్బందిని కిడ్నాప్ చేసి వాహనంలో బంధించి ఎమ్మెల్యే దౌర్జన్యానికి పాల్పడుతూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ, భౌతిక దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగుల వాకీటాకీలు, సెల్ ఫోన్‌లు ఇతర వస్తువులను తీసుకొని వాహనంలో శ్రీశైలం, సున్నిపెంట రోడ్లన్నీ తిప్పుకుంటూ దాడిచేశారని పేర్కొన్నారు. గెస్ట్‌హౌస్‌లో బంధించి ఇబ్బంది పెట్టి రాత్రి రెండు గంటలకు వదలి పెట్టారని తెలిపారు. సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న అటవీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు జి.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.అబ్దుల్ కలాం, రాయలసీమ జోనల్ సెక్రటరీ డి.మౌలాలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రతీదేవి, జాయింట్ సెక్రటరీ ఆర్. కాసిదాసు, కోశాధికారి సి. అనురాధ పేర్కొన్నారు. ఉపముఖ్య మంత్రి, అటవీ శాఖ మంత్రి స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదోన్నతులకు గ్రహణం

- ఏడాదిగా ముందుకు సాగని ప్రక్రియ
- ఎదురు చూస్తున్న 150 మంది గ్రేడు–2 వీఆర్వోలు
- కొందరు డబ్బులు వసూలు చేసిన వైనం!



కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 150 మంది గ్రేడు–2 వీఆర్వోల పదోన్నతి ప్రక్రియ ఏడాదిగా నిలిచిపోయింది. గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలో రెండు జిల్లాల పరిధిలో 469 మంది గ్రేడు–2 వీఆర్వోలను నియమించారు. వీరికి 2023 ఆఖరిలోనే గ్రేడు–1 వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని అప్పటి ప్రభుత్వం యోచించింది. అయితే ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2023 ఏప్రిల్ 3వ తేదీన పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని 2024 అక్టోబర్ 10వ తేదీన జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చాయి.

మే 9న తుది జాబితా

పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితాను తయారు చేసేందుకు రెండు నెలలు, తుది జాబితా తయారీకి మరో నెల సమయం పట్టింది. మొత్తంగా 2025 జనవరి ఏడో తేదీ నాటికి పదోన్నతులకు అర్హత ఉన్న జాబితాను తయారు చేశారు. ఆ జాబితా ప్రకారం 150 ఖాళీలకు రోస్టర్ రూపొందించడానికి మార్చి 25వ తేదీ వరకు సమయం పట్టగా...దానిపై అభ్యంతరాలను స్వీకరించడానికి ఏప్రిల్ 3వ తేదీ వరకు గడువు విధించారు. అయితే తరువాత ఏప్రిల్ 19వ తేదీ వరకు ఆలస్యం చేయడంతో ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు రావడంతో దాని ప్రకారం రోస్టర్ తయారు చేయడానికి ఏప్రిల్ 30వ తేదీ వరకు సమయం తీసుకుని మే 9వ తేదీన పూర్తి స్థాయి తుది జాబితాను రూపొందించారు.

అధికారుల అలసత్వం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారుల అలసత్వంతోనే గ్రేడు–2 వీఆర్వోల పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని ఆశావాహక ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పదోన్నతుల పేరిట వసూళ్లు

2024 ఆగస్టు నుంచి గ్రేడు–2 వీఆర్వోల పదోన్నతుల ప్రక్రియ మొదలు కావడంతో అప్పట్లో పనిచేసిన కొందరు ఉన్నతాధికారులు ఆశావాహుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. జాబితాలో పేరు ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని కలెక్టరేట్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు డిమాండ్ చేశారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారు. అయితే డబ్బులు ఇచ్చినా పదోన్నతి రాకపోవడం..ఇటు డబ్బులు వసూలు చేసిన అధికారులు బదిలీపై వెళ్లడంతో వారికి దిక్కు తోచడంలేదు. తాము ఇచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వాలని అడుగుతున్నా వసూలు చేసిన అధికారులు ఇవ్వడంలేదనే వాదన ఉంది.

కలెక్టర్ ఆగస్టులో ఆదేశాలు ఇచ్చినా రోస్టర్‌తో కూడిన అర్హుల జాబితాను తయారు చేయడానికి 8 నెలలు తీసుకోవడం..అదే సమయంలో ఎస్సీ వర్గీకరణ రావడంతో ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలిగినట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణ ఏప్రిల్ 19వ తేదన విడుదలైంది. అయితే ఏప్రిల్ మొదటి వారంలోనే కృష్ణ, శ్రీకాకుళం జిల్లాల్లో గ్రేడు–2 వీఆర్వోల పదోన్నతులను పూర్తి చేశారు. అయితే జిల్లా అధికారులు మాత్రం తమ నిర్లక్ష్యంతో తుది అర్హత జాబితాను రూపొందించకపోవడమే ఈపరిస్థితికి కారణంగా తెలుస్తోంది.

రేషనలైజేషన్‌తో నిలిచిపోయిన ప్రక్రియ

జిల్లాలో 150 మంది గ్రేడు–2 వీఆర్వోలకు గ్రేడు–1 హోదా పదోన్నతులకు సంబంధించిన తుది జాబితా కలెక్టర్ ఆమోదం కోసం మే 9న వెళ్లింది. అయితే ప్రభుత్వం రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టడంతో అధికారులు పదోన్నతుల ప్రక్రియను నిలిపివేశారు. రేషనలైజేషన్ ప్రక్రియ ముందుకు సాగక.. పదోన్నతులు రాక గ్రేడు–2 వీఆర్వోలు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. ఇటీవల తిరిగి గ్రేడు–2 వీఆర్వో పదోన్నతులకు అవకాశం ఇవ్వాలని కోరుతూ జిల్లా యంత్రాంగం సీసీఎల్ఏకు లేఖ రాసింది. అక్కడి నుంచి అనుమతి వస్తే పదోన్నతుల ప్రక్రియ మళ్లీ ముందుకు కదులుతుంది..లేదంటే లేదు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తు ప్రింట్‌ను 27వ తేదీన సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. మెరిట్ ప్రకారం ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నందీశ్వరుడికి పరోక్షసేవ



శనగల బసవన్నకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శాస్త్రోక్తంగా అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజుల్లో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. బుధవారం 28 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలతో అలాగే మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

ఉచిత బస్సులు లేక మహిళలకు తప్పని తిప్పలు



పత్తికొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు కోసం వేచి చూస్తున్న మహిళలు

పత్తికొండ: గంటల తరబడి ఎదురు చూసినా ఉచిత బస్సు ఒక్కటి కూడా రాదు. బస్టాండ్‌లో నిరీక్షించలేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తికొండ నుంచి గుంతకల్, గుత్తి, ఆదోని వైపు వెళ్లడానికి బస్సుల కొరత ఉంది. కొన్ని బస్సులకు మాత్రమే ఉచితం అనుమతి ఇచ్చారు. ఐదు గంటల వరకు ఒక్క బస్సూ రాకపోవడంతో బుధవారం పత్తికొండ బస్టాండ్ మహిళలతో కిక్కిరిసి కనిపించింది.

శ్రీశైల ఆలయంలో ఇద్దరిపై వేటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు కొరడా ఝులిపించారు. స్వర్ణరథోత్సవం నిర్వహణలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్ట్ సహాయ ఇంజినీర్ జీ.రాజారావు, టెక్నికల్ అసిస్టెంట్ ఐ.శ్రీనివాసును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19న నిర్వహించిన స్వర్ణరథోత్సవం కార్యక్రమంలో విధుల్లో ఉండాల్సిన రాజారావు, శ్రీనివాసులు గైర్హాజరైనట్లు ఈఓ గుర్తించారు. ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆపరేటర్ షెడ్ హైడ్రాలిక్ షట్టర్‌ను పాక్షికంగా తెరవడంతో స్వర్ణరథోత్సవం పైభాగం చామరము నొక్కుకు పోయింది. ఈ క్రమంలో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

నన్నారి ప్రాసెసింగ్ కేంద్రం ప్రారంభం

ఆత్మకూరు/శ్రీశైలం టెంపుల్: పట్టణంలోని అర్బన్ కాలనీలో నన్నారి ప్రాసెసింగ్ సెంటర్‌ను బుధవారం రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రాంత గిరిజనులు స్వయం ఉపాధి లో రాణించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే ఆత్మకూరు ప్రాంతంలో 18 ఎకరాల్లో నన్నారి నర్సరీలను ఏర్పాటు చేశామన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 7 కేంద్రాల్లో గిరిజనులకు మార్కెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో కేంద్రానికి రూ.కోటి కేటాయించామన్నారు. వీటి ద్వారా ఉత్పత్తులు పెంచుకుని గిరిజనులు ఉపాధి పొందాలన్నారు. అనంతరం ఆత్మకూరు పట్టణంలో చెంచుల కోసం ఏర్పాటు చేసిన కుట్టుమిషన్, మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. శ్రీశైలంలోని చెంచు మ్యూజియం వద్ద గిరిజన బహుళ ప్రయోజన మార్కెటింగ్ కేంద్రం నిర్మాణానికి బుధవారం మంత్రి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్త జయసూర్య, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్, ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్ర కనిపింఛన్!

- విధి వంచితులతో చెలగాటం
- లబ్ధిదారుల జాబితా నుంచి దివ్యాంగుల తొలగింపు
- మళ్లీ దరఖాస్తు చేసుకోండి అంటూ ప్రకటన
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న బాధితులు

వారంతా విధి వంచితులు. చూపు లేని వారు కొందరు.. పుట్టుకతోనే మంచానికి పరిమితమైన వారు మరికొందరు.. దీర్ఘకాలిక రోగులు ఇంకొందరు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పింఛనే వారికి ఆధారం. అలాంటి వారితో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామంటూనే కోతలు మొదలు పెట్టింది. దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారులకు వైద్య పరీక్షల పేరుతో నిన్నటి వరకు ఆసుపత్రుల చుట్టు తిప్పుకుంది. ఇప్పుడు పింఛన్‌కు అర్హత పొందే వికలత్వం లేదంటూ నోటీసులు ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నోటీసులు అందుకున్న వారు మళ్లీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

మాకెందుకు ఈ కష్టాలు!



వివరాలు నమోదుకు వచ్చిన దివ్యాంగులు

ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న పింఛన్‌ను ఒక్కసారిగా కూటమి ప్రభుత్వం తొలగించడంతో దివ్యాంగులు అష్టకష్టాలు పడుతున్నారు. బుధవారం వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని దరఖాస్తులు పూర్తి చేసి అధికారులు అందజేశారు. మండలంలో 194 మంది లబ్ధిదారులను అనర్హత పేరుతో తొలగించారు. పింఛన్, సదరం సర్టిఫికెట్ పునరుద్ధరించేందుకు మరో సారి దరఖాస్తు చేయాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వస్తున్న పింఛన్‌ను తొలగించి మాకెందుకు ఇన్ని కష్టాలు పెడుతున్నారని వాపోయారు. లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేస్తే విడతల వారీగా దివ్యాంగులకు మళ్లీ రీవెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. వైద్యులు పరీక్షలు చేశాక వైకల్యాన్ని నిర్ధారిస్తారు. 40 శాతం కంటే తక్కువగా ఉంటే పింఛన్ మంజూరు కాదు. ప్రస్తుతం తొలగించిన వాళ్లలో ఎక్కువ భాగం అర్హత ఉన్న వారి పేర్లు గల్లంతయ్యాయి. గతంలో వైద్యులే పరిశీలించి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేశారని ఇప్పుడు కొత్తగా ఈ పరీక్షలు ఎందుకని దివ్యాంగులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. – కొలిమిగుండ్ల

చెప్పకోలేని వ్యథ



గతంలో అధికారులు ఇచ్చిన 55 శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ చూపుతున్న వ్యక్తి పేరు మాల చిన్న తిమ్మప్ప. మండల కేంద్రం నందవరం సొంతూరు. పుట్టుకతోనే చెవిటి, మూగ. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాదు. వినిపించని పరిస్థితి. గతంలో ఇచ్చే దివ్యాంగుల పింఛన్ కూటమి ప్రభుత్వం ఇప్పుడు నిలిపేస్తామని నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న తీరుపై మూగ సైగలతో ఆవేదన వ్యక్తం చేశాడు. రీ వెరిఫికేషన్‌లో తాత్కాలిక వైకల్యం ఉందని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని..తమలాంటి వారికి సాయం చేసి ఆదుకోవాలని కోరుతూ వేడుకున్నాడు. – నందవరం

పుట్టుకతో దివ్యాంగుడికి వైకల్యమే లేదట..



ఇక్కడ బండపై పడుకుని అమాయకంగా నవ్వుతున్న దివ్యాంగ బాలుడి పేరు లీలాధర్. ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామానికి చెందిన ఈ బాలుడు పుట్టుకతోనే దివ్యాంగుడు. ఎదుగుదల లేదు, నడవలేడు.. కూర్చో లేడు.. మాటలు రావు.. కళ్లు కూడా సరిగా కనిపించవు. ఈ బాలుడికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంద శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చి దివ్యాంగ పింఛన్ మంజూరు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఈ బాలుడికి అసలు వికలత్వం లేదని, అందువల్ల పింఛన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు ఇచ్చింది. అప్పటి నుంచి ఏం చేయాలో అర్థంకావడం లేదని బాలుడి తండ్రి శివ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – ఆళ్లగడ్డ

ఓబులేసుకు పింఛన్ పాయె..



ఇక్కడ కుర్చీలో కూర్చున్న అంధుడు పేరు గుడిశ ఓబులేసు (గుడ్డి ఓబులేసు) ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామానికి చెందిన ఇతను పుట్టుకతోనే అంధుడు. దీంతో పాటు శరీరంలోని మరి కొన్ని అవయవాలు కూడా సక్రమంగా పనిచేయక అనారోగ్యంతో ఉంటాడు. దీంతో 2004లో పింఛన్ మంజూరు చేయడం జరిగింది. అనంతరం సదరన్ క్యాంపులో వంద శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ మంజూరు చేయడంతో 6 సంవత్సరాల నుంచి దివ్యాంగ పింఛన్ పొందుతున్నాడు. అయితే గత మూడు రోజుల క్రితం ఇతనికి ఎలాంటి వైకల్యం లేదని పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు సైతం ఆశ్చర్య పోతున్నారు. ఒంటరి వాడైన ఇతన్ని చూసుకునేందుకు ఇంటి దగ్గర ఉంటూ పింఛన్ సొమ్ముతో కాలం గడపుతున్నామని ఇప్పుడు ఎలా బతికేదని అతని తల్లి సుబ్బమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. – ఆళ్లగడ్డ

పేదలపై చిన్న 'చూపు'



వంద శాతం వైకల్యం ఉన్న సర్టిఫికెట్ చూపిస్తున్న రమణమ్మ, ఆమె కుమారులు, కుమార్తె

కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోత ఎంత దారుణంగా ఉందో చెప్పేందుకు ఈ కుటుంబానిదే నిదర్శనం. మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో నలుగురు అంధులు ఉన్నారు. గొల్ల రమణమ్మ, ఆమె ఇద్దరు కుమారులు పెద్ద మద్దిలేటి, నడిపి మద్దిలేటి, కుమార్తె మద్దమ్మ అంధులు. రమణమ్మ భర్త సుబ్బన్ననే భార్యా, పిల్లలను ఇప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటూ సేవలు అందిస్తున్నారు. పింఛన్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ఈ కుటుంబానికి కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. అనర్హుల ఏరివేత పేరుతో అర్హులను సైతం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తుండటంతో దివ్యాంగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నలుగురికి వంద శాతం వైకల్యం ఉన్నా వికలత్వ శాతం పునః పరిశీలన పేరుతో డాక్టర్లు 40 శాతంగా నిర్ధారించడంతో అధికారులు వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపేస్తామని నోటీసులు ఇచ్చారు. దీంతో ఆ నలుగురు ఆందోళన చెందుతున్నారు. తూతూ మంత్రంగా వైద్య పరీక్షలు నిర్వహించి కంటి చూపులేని మా కడుపులు కొట్టడం దారుణమని, పింఛన్ రాకపోతే ఆత్మహత్యే శరణ్యం తప్ప మరే మార్గం కనిపించడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. జిల్లా కలెక్టర్ రాజ్‌కుమారి, ఎమ్మెల్యే జయసూర్య స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేసి, పింఛన్ ఇప్పించాలని కోరుతున్నారు. – నందికొట్కూరు

ఈ బాలుడు అనర్హుడట..



ఈ చిత్రంలోని బాలుడి పేరు షేక్ షాషా..కర్నూలులోని గనిగల్లీకి చెందిన ఈ బాలుడి వయస్సు 15 ఏళ్లు. ఈ బాలుడిని చూస్తే.. ఎవ్వరైనా అయ్యో పాపం అంటారు. పుట్టుకతోనే పోలియో కారణంగా రెండు కాళ్లు పనిచేయవు. లేపడానికి, కూర్చొబెట్టడానికి సహకారం తప్పనిసరి. మామూలుగా అయితే ఈ బాలుడికి హెల్త్ పింఛన్ మంజూరు కావాలి. 2015 సెప్టెంబరు 14న టీడీపీ ప్రభుత్వం హయాంలోనే సదరం క్యాంపునకు వీరి తల్లిదండ్రులు తీసుకపోగా.. 100 శాతం వికలత్వం ఉన్నట్లు నిర్ధారించి సర్టిఫికెట్ ఇచ్చారు. రీ వెరిఫికేషన్‌లో భాగంగా సదరం క్యాంపునకు వెళ్లిన డాక్టర్లకు పోలియోతో పోయిన షేక్ షాషా కాళ్లు గమనించకుండా.. వికలత్వం తాత్కాలికమేనంటూ.. 40 శాతం లోపే వికలత్వ శాతం ఇచ్చారు. దీంతో పింఛన్ రద్దు అయిందంటూ మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇచ్చారు. డాక్టర్లు కళ్లుండి చూసే సదరం సర్టిఫికెట్ ఇచ్చారా అనే ప్రశ్న ఉత్పన్నమైంది. సదరం క్యాంపుల్లో డాక్టర్లు నిజాయితీ, చిత్తశుద్ధితో వ్యవహరించారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. – కర్నూలు(అగ్రికల్చర్)

దివ్యాంగుల ఆగ్రహం



కోసిగి ఎంపీడీఓ కార్యాలయం గేటు వేసి నోటీసులతో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు, ప్రజాసంఘాల నాయకులు

- ఎంపీడీఓ కార్యాలయం గేటు మూసి నిరసన

కోసిగి: వికలాంగత్వం తక్కువ చూపి పింఛన్ తొలగించేందుకు కుట్ర పన్నుతున్న కూటమి ప్రభుత్వంపై దివ్యాంగులు కన్నెర్రజేశారు. ఇదెక్కడి న్యాయమంటూ నిరసనగళం వినిపిస్తున్నారు. కోసిగి మండలంలో నోటీసులు అందుకున్న పలువురు తమ గోడు వినిపించేందుకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే, అక్కడ అటెండర్ తప్ప అధికారులెవ్వరూ లేకపోవడంతో కార్యాలయం గేటు మూసి వేసి ఆందోళనకు దిగారు. దాదాపు రెండు గంటల పాటు కార్యాలయం ఎదుట కూర్చొని ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో వచ్చిన ఎంపీడీఓ ఈశ్వరయ్య దివ్యాంగులతో మాట్లాడకుండా కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. మా ఆవేదన పట్టదా అంటూ నిలదీశారు. ఎన్నో ఏళ్ల నుంచి తమకు పింఛన్ వస్తుందని, ఇప్పుడెందుకు నోటీసులు పంపించారని ప్రశ్నించారు. ఈక్రమంలో ఎంపీడీఓ, దివ్యాంగుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, అలాగే మరోసారి రీవెరిఫికేషన్ చేయిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

22న డీఎన్‌కే అవగాహన సమావేశం



జీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు తపాలా అధికారి

కర్నూలు(అర్బన్): కర్నూలు ప్రధాన తపాలా సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు డాక్ ఘర్ నిర్యాత్ కేంద్ర్ (డీఎన్‌కే) అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు తపాలా అధికారి జీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు సంబంధించిన వ్యాపారులకు సంబంధించి పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ఈ సమావేశంలో వివరించనున్నట్లు చెప్పారు. విదేశాలకు తమ ఉత్పత్తులను/వస్తువులను ఎగుమతి చేయాలనుకునే చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులు, ఐఈసీ హోల్డర్లకు ఇది ఒక మంచి అవకాశమన్నారు. సమావేశంలో ఎగుమతుల విధానాలను నిపుణులు వివరిస్తారన్నారు. మరిన్ని వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హెచ్ గరీబ్‌బాషాను 8919286405 నంబర్‌లో సంప్రదించాలన్నారు. పోస్ట్ ప్యాక్ ద్వారా జిల్లా ప్రజలు తమ ఉత్పత్తులను ప్రధాన కార్యాలయంలో పార్సెల్ ప్యాకింగ్ చేసుకునే సౌకర్యం కూడా ఉందని ఆయన తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నెకు చెందిన ఓ రైతు బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత రైతు వెంకటరమణ ఆచారి అందించిన సమాచారం మేరకు.. గ్రామ శివారులోని 420 సర్వేనంబర్‌లో గ్రామానికి చెందిన మునెమ్మకు 47 సెంట్లు భూమి ఉంది. ఆమెకు వెంకటరమణ ఆచారి, రామచంద్ర ఆచారి, సుబ్బరాయుడు ముగ్గురు సంతానం. ఇటీవల అనారోగ్యంతో మునెమ్మ మృతి చెందింది. ముగ్గురు కుమారులు ఆ భూమిని సమాన భాగాలుగా పంచుకోవాల్సి ఉంది. ప్రస్తుతం పొలం వెంకటరమణ ఆచారి ఆధీనంలో ఉంది. అదే గ్రామానికి చెందిన నాగరత్నం ఆచారికి పక్కనే పొలం ఉంది. చిన్నకొప్పెర్లకు చెందిన కొందరు వ్యక్తుల ప్రోద్బలంతో నాగరత్నం ఆచారి దౌర్జన్యంగా పొలంలోకి దిగి ట్రాక్టర్‌తో దున్ని ఆక్రమించుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన వెంకట రమణ ఆచారి క్రిమి సంహారక మందు తాగి ఆపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. రైతు ఆత్మహత్యయత్న సంఘటనపై రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

తల్లి మందలించిందని..

కర్నూలు: బడికి వెళ్లకుండా ఆవారాగా తిరుగుతుండటంతో తల్లి మందలించిందని ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన చాకలి నాగేశ్వరి ఏడాది క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వలస వచ్చి గణేష్ నగర్‌లో నివాసముంటున్నారు. ఈమె భర్త కృష్ణ రెండేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు చాకలి సంతోష్ కుమార్ (16) 9వ తరగతి చదువుతున్నాడు. కొంతకాలంగా బడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటూ ఆవారాగా తిరుగుతుండటంతో బుధవారం ఉదయం తల్లి తీవ్రంగా మందలించి పనికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సంతోష్ కుమార్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గుర్తించి స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గీత కులాలకు ఐదు మద్యం బార్లకు నోటిఫికేషన్

- 29 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 30న లాటరీ ద్వారా బార్ల కేటాయింపు

కర్నూలు: నూతన బార్ పాలసీలో భాగంగా గీత కులాలకు పది శాతం బార్లు రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించాలనే నిబంధన మేరకు 5 నూతన మద్యం బార్లకు కలెక్టర్ల అనుమతితో ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ అధికారులు సుధీర్ బాబు, రవి కుమార్ బుధవారం గెజిట్ విడుదల చేశారు. ఈనెల 29న సాయంత్రం 5 గంటల వరకు గీత కులాల వారు వారికి రిజర్వు చేసిన బార్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈనెల 30వ తేదీన కర్నూలుకు సంబంధించి జిల్లా పరిషత్ సమావేశ భవనంలో, నంద్యాలకు సంబంధించి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో లాటరీ పద్ధతిలో రిజర్వేషన్ కింద కేటాయించిన బార్లకు లైసెన్సులు జారీ చేయనున్నారు. గౌడ కులాలకు కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 2, ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 1, నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 1, డోన్ మున్సిపాలిటీ పరిధిలో 1 చొప్పున రిజర్వేషన్ ప్రాతిపదికన బార్లను కేటాయించనున్నారు.

కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి...

ఆశావహులు తహసీల్దార్ జారీ చేసిన సప్లిమెంటరీ కుల ధ్రువీకరణ పత్రం ఖచ్చితంగా జత చేయాలి. అలాగే ఒక్కొక్క దరఖాస్తు విలువ తిరిగి చెల్లించని (నాన్ రిఫండబుల్) రూ.5 లక్షలతో పాటు రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ బార్ల రిటైల్ ట్యాక్స్‌లో 50 శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మూడు సంవత్సరాల కాల పరిమితితో ప్రభుత్వం నూతన బార్ పాలసీని రూపొందించింది. ఇందులో భాగంగా 2025–26 సంవత్సరానికి రూ.27.50 లక్షలు, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాలి. తదుపరి రెండు సంవత్సరాలు 10 శాతం అదనపు రిటైల్ ట్యాక్స్‌ను జోడించి ఆరు వాయిదాలలో చెల్లించే వెసులుబాటు కల్పించారు. గీత కులాలకు రిజర్వు చేసిన బార్లకు ఆసక్తి ఉన్న వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని కర్నూలు జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు సూచించారు.

వ్యాపారుల నుంచి కొరవడిన స్పందన...

మూడేళ్ల కాల పరిమితితో రూపొందించిన నూతన మద్యం బార్ పాలసీ పట్ల వ్యాపారుల నుంచి స్పందన కొరవడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు నూతన బార్ పాలసీ అమలులో ఉంటుంది. జనరల్ కేటగిరీ కింద ఉమ్మడి జిల్లాలో 42 బార్లకు లైసెన్సులు జారీ చేసేందుకు ఈనెల 18న ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ అధికారులు గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే, రెండు రోజులు గడిచిపోయినా వ్యాపారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. మద్యం వ్యాపారంలో అనుభవమున్న పాత వారితో పాటు కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వారిని ఎక్సైజ్ అధికారులు పిలిపించి ప్రోత్సహిస్తున్నారు. నూతన పాలసీలో వ్యాపారం గిట్టుబాటు కాదని, ఎవరు కూడా దరఖాస్తులు చేయకూడదని తీర్మానించుకున్నట్లు సమాచారం. బార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటూరుకు చెందిన రాయల సుబ్బారావు ఆదేశాల మేరకు జిల్లాలో కూడా మద్యం బార్లకు ఎవరూ దరఖాస్తులు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు చర్చ జరుగుతోంది.

వైద్యసేవ కియోస్కులకు పచ్చరంగు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పచ్చరంగులోకి మారిన వైద్యసేవ కియోస్క్

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలులో భాగంగా కర్నూలు జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యమిత్రల కోసం ఏర్పాటు చేసిన కియోస్కులకు పచ్చరంగు పులిమారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీగా ఉన్న పేరును తొలగించడమే గాక ఎన్టీఆర్ వైద్యసేవను చేర్చడంతో పాటు అందుకు సంబంధించి రంగు మొత్తం పచ్చగా మారింది. – కర్నూలు(హాస్పిటల్)

హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

- ప్రస్తుత సీజన్‌లో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి
- సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బి. రాధిక

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల భద్రతను మొదటి ప్రాధాన్యతగా స్వీకరించి విధులు నిర్వహించాలని ఆ శాఖ సాధికారత అధికారిణి బి. రాధిక కోరారు. బుధవారం ఉదయం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో ఏఎస్‌డబ్ల్యూఓ, హెచ్‌డబ్ల్యూలతో ఆమె సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, ముఖ్యంగా కొనుగోలు చేస్తున్న వస్తువులపై ఎక్స్‌పైరీ తేది చూసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కొత్తగా హాస్టళ్లలో ప్రవేశం పొందిన విద్యార్థుల, ట్యూటర్ల జాబితాలను కూడా పంపలేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. పలు హాస్టళ్లలో మెనూ సక్రమంగా పాటించడం లేదని, కోడిగుడ్లు కూడా విద్యార్థులకు పెట్టడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇప్పటి నుంచి ప్రతి వసతి గృహ సంక్షేమాధికారి రోజుకు రెండు పర్యాయాలు ఎఫ్ఆర్ఎస్ వేయాల్సి ఉందన్నారు. సెలవు రోజుల్లో మూడు సార్లు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని వసతి గృహాల్లో టాయ్‌లెట్లను శుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ మూత్ర, మల విసర్జనకు అనుమతించరాదన్నారు. సహాయ సంక్షేమాధికారులు ఆయా వసతి గృహాలను తనిఖీ చేసిన రిపోర్టులను పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారులు కె. బాబు, ఎస్. లీలావతి, బి.మద్దిలేటి పాల్గొన్నారు.

పెద్దరాజు స్వామి దర్గా ఉరుసు ప్రారంభం



పుష్పాలంకరణలో పెద్ద రాజు స్వామి

బేతంచెర్ల: మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన గూటుపల్లె పెద్ద రాజుస్వామి ఉరుసు బుధవారం ప్రారంభమైంది. ఉదయం నగరాతో ఉరుసును దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి ప్రారంభించారు. ఉరుసుకు హాజరైన ఆయా ప్రాంతాల భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

